క్లుప్తంగా

కలం వీరుడు షోయబ్ ఉల్లాఖాన్



నడికూడ: షోయబ్ ఉల్లాఖాన్ జయంతి పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు మాట్లాడుతూ.. పెన్నును గన్నుగా మార్చి అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించిన అక్షర వీరుడు, తన రచనల ద్వారా ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన నిబద్ధత గల పాత్రికేయుడు షోయబ్ ఉల్లాఖాన్ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మల్హర్ రావు, మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, మహ్మద్ జమాల్‌ద్దీన్, లోకెటి నాగేశ్, రవి, రాకేశ్, రాజు, పవన్ పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్



శాయంపేట : గుడుంబా రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొప్పుల గ్రామ శివారులో గురువారం ఎక్సైజ్ పోలీసులు రూట్ వాచ్ చేస్తుండగా సూర్యానాయక్ తండా నుంచి కొప్పులకు గుడుంబా రవాణా చేస్తున్న బానోతు నరేశ్, అజ్మీరా రాజును పట్టుకున్నట్లు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి వారి వద్ద పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, కానిస్టేబుల్ అఖిల్, విజయకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

శాయంపేట : హనుమకొండ నుంచి మండల కేంద్రం మీదుగా పత్తిపాకకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని దీంతో రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవ తీసుకొని హనుమకొండ, పరకాల నుంచి పత్తిపాకకు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఆత్మకూరు: మండలంలోని కామారం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఆత్మకూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారం గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి చిరంజీవి పీడీఎస్ బియ్యాన్ని సేకరించి నిల్వచేశాడు. పక్కాసమాచారంతో వెళ్లి తనిఖీలు చేపట్టి.. 45కిలోల బరువున్న 22 బస్తాల్లో 9క్వింటాళ్ల 90 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ.25,740 ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

శాయంపేట విద్యుత్ ఏఈగా చందూలాల్



శాయంపేట : శాయంపేట విద్యుత్ శాఖ ఏఈగా చందూలాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏఈ రాజ్‌కుమార్ నిర్మల్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో చందులాల్ బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన చందూలాల్‌ను పరకాల ఏడీ దేవేందర్ నాయక్, లైన్‌మెన్లు రాజ్‌కుమార్, సోమ్లానాయక్, ఏఎల్ఎం స్వామి, ఐలేశ్, సంతోశ్, సాగర్, శ్రీకాంత్, విష్ణు తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలని, తక్షణమే పరిష్కరిస్తానని ఏఈ చందూలాల్ తెలిపారు.

బరపాటి గోపికి డాక్టరేట్

రామన్నపేట: నగరంలోని ఏవీవీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బరుపాటి గోపికి శారీరక విద్యలో రాజస్థాన్ రాష్ట్రం అల్వార్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. క్రీడా శారీరక ప్రదర్శనపై మనో సామాజిక విధానాల ప్రభావం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గోపికి డాక్టరేట్ లభించింది. డాక్టర్ నల్లెల శ్రీనివాస్, ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షణలో గోపి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

భయం.. భయం



రోడ్డుపై గుంపుగా తిరుగుతున్న కుక్కలు



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు(ఫైల్)

భౌభౌ అంటున్న కుక్కలు.. బాబోయ్ అంటున్న జనాలు

- ఇళ్ల మధ్యనే సంచరిస్తున్న శునకాలు
- పట్టించుకోని అధికారులు
- నియంత్రించాలని ప్రజల వేడుకోలు

ఆత్మకూరు: మండలకేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కుక్కల స్వైరవిహారంతో జనాలు జంకుతున్నారు. ఆయా గ్రామాల్లోని వీధులు, ఇళ్ల మధ్యనే కుక్కలు తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కోతుల సమస్య తీవ్రం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనాలకు.. వీధి కుక్కలతో మరో తలనొప్పి వచ్చిపడింది. గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలు చిన్నా పెద్ద అనే తేడా లేకుండా కరుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల మండలంలోని అక్కంపేటలో ఏకంగా గొర్రెల మందపై కుక్కలు దాడిచేయడంతో పలుగొర్రెలు మృత్యువాతపడ్డాయి. దీంతో యజమానికి ఆర్థికంగా నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా.. పలు గ్రామాల్లో కుక్కలు అనారోగ్యం బారినపడ్డాయి. దీంతో చర్మం ఊడిపోయిన భయానకంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో కుక్కలు ఎర్రి లేచి విచ్చలవిడిగా తిరుగుతోండడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బయపడుతున్నారు.

ఇప్పటికైనా పంచాయతీ రాజ్ అధికారులు ప్రణాళికతో కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఇంజక్షన్లు ఇస్తే సంఖ్య పెరగకుండా ఉంటుందని ఆదిశగా. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సమస్యను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



గ్రామాల్లో కుక్కల సమస్య ప్రమాదకరంగా మారింది. పంచాయతీ అధికారులు ఈసమస్యపై దృష్టి పెట్టి పరిష్కారానికి కృషిచేయాలి. ప్రజల ఇబ్బందులను దూరం చేయాలి.

– రేవూరి ప్రవీణ్‌రెడ్డి, వార్డు మాజీ సభ్యుడు

ఎలుకలు.. పిల్లులు

పుస్తకాలపై సేదదీరుతున్న పిల్లి



కుర్చీలో దర్జాగా కునుకుతీస్తున్న పిల్లి



- పరకాల గ్రంథాలయాన్ని స్థావరంగా మార్చుకున్న వైనం
- ఇబ్బందిపడుతున్న పాఠకులు

పరకాల: పరకాల గ్రంథాలయం ఎలుకలు, పిల్లుల స్థావరంగా మారింది. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే శిథిలమైన, అసంపూర్తి భవనంలో నిర్వహిస్తున్న పరకాల గ్రంథాలయంలో కనీస సదుపాయాలు లేవు. దీనికితోడు గ్రంథాలయంలో గత కొంత కాలంగా ఎలుకలు సంచారం పెరిగిపోయింది. వాటి కోసం పిల్లులు గ్రంథాలయానికి చేరుకుంటూ ఎంచక్కా పుస్తకాలు, కూర్చిలపై సేదదీరుతున్నాయి. ఆయా పుస్తకాలపైనే మల, మూత్ర విసర్జన చేయడంతో పుస్తకాలు పట్టుకోలేని పరిస్థితి ఉంటుందని పాఠకులు వాపోతున్నారు. పిల్లుల మల మూత్రాల దుర్వాసన గదిమొత్తం విస్తరిస్తుందని దాంతో ముక్కుమూసుకుని చదువుకోవాల్సి ఉంటుందని పాఠకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పిల్లుల అరుపులు.. ఎలుకల పరుగులతో చదువుకోలేకుండా ఇబ్బంది ఉంటుందని పాఠకులు చెబుతున్నారు. కొన్నిసార్లు అవి పాఠకుల కూర్చున్న కుర్చీల కింద ఉండి కాళ్లపై పాకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా లైబ్రరీయన్, అధికారులు ఎలుకలు, పిల్లులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

దామెర: ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతుందని కేర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఆరోపించారు. తెలంగాణ ఫార్మసీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు మండలంలోని ఒగ్లాపూర్‌లోని కేర్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం కళాశాల గేటుకు తాళం వేసింది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల గేటుఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఫీ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించడం వల్లనే తాము విద్యనభ్యసిస్తున్నామని, ఆ బిల్లులు చెల్లించకపోవడం వల్ల తాము చదువుకునే పరిస్థితి లేకుండాపోతుందన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా కనీసం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత ఈ పరిస్థితికి విద్యా శాఖ మంత్రి లేకపోవడం ప్రధాన కారణమన్నారు. వెంటనే బకాయిలను విడుదల విద్యార్థులు డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలు చెల్లించేవరకు కళాశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొత్తకొండలో 1997-98 బ్యాంచ్ పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ (సీతారాంపూర్) జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం సునితారాణీ ఆధ్వర్యంలో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1997–98బ్యాంచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో రిటైడ్ ప్రధానోపాధ్యాయుడు మాస్టర్ తిరుపతయ్య, అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



చందర్‌రావును పరామర్శిస్తున్న ఎర్రబెల్లి, మార్నేని



బియ్యం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు: నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు పెద్ద కోడలు తక్కళ్లపెల్లి శ్వేత(45) గురువారం అనారోగ్య కారణాలతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు తదితరులు.. శ్వేత మృతదేహానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ మధుమతి, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ప్రముఖ న్యాయవాది శ్యాంసుందర్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, జీఎంపీఎస్ మండల కార్యదర్శి గబ్బెట రాంకుమార్, సొసైటీ డైరెక్టర్లు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ఆర్థిక సాయం

శాయంపేట: మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దామెర మల్లయ్య(మాస్) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి ఆదిరెడ్డి మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.వేయి, 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట నాయకులు తుడుం రవీందర్, గజ్జి రమేశ్, గజ్జి సాంబయ్య, పోతుగంటి స్వామి, పెండెల పోశయ్య ఉన్నారు.

పరామర్శ

శాయంపేట మండల కేంద్రానికి చెందిన గన్ను ధనలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చకిలం రవీందర్ సందర్శించి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు గిద్దమారి సురేశ్, వనం దేవరాజ్, బాసాని విద్యాసాగర్ ఉన్నారు.

కార్పొరేషన్ రుణాల్లో అర్హులకు న్యాయం చేయాలి



రుణాల జాబితాను చూపిస్తున్న దళితులు

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ వర్తింపజేయాలని మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గడిపే విజయవిజయ్‌కుమార్, నాయకులు మస్కే భాస్కర్ అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మైలారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడానికి అప్పటి సర్పంచ్, ఎంపీటీసీలు ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై 2023 మార్చి 28న అవగాహన సదస్సు నిర్వహించగా కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పాల్గొని పథకాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సహకారంతో మైలారం గ్రామంలో 72 మంది దళితులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో కార్పొరేషన్ రుణాల పంపిణీ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో కాంగ్రెస్ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ఎంపీడీఓపై ఒత్తిడి తెచ్చి 72 మంది జాబితాలో బీఆర్ఎస్ కార్యకర్తల పేర్లను తొలగించి కేవలం 60 మందితో కూడిన జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా 72 మంది జాబితాతోపాటు మరికొంత మంది అర్హులకు కార్పొరేషన్ రుణాలు అందేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



కమలాపూర్: వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న బోయ కులస్తులు



నేరుడుపల్లిలో..



శాయంపేటలో శోభాయాత్ర..

శాయంపేట : మండలంలోని శాయంపేట, నేరేడుపల్లి గ్రామాల్లో గురువారం బోయ వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బోయ కమ్యూనిటీ భవనంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి నివాళులర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై డీజే సౌండ్స్‌తో శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. నేరేడుపల్లిలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు బేరుగు సతీశ్, లింగయ్య, చల్లా చంద్రమౌళి, తరుణ్ గోపి, కన్నయ్య, సూర్యప్రకాశ్, భోగి ఐజిగిరి, ప్రధాన కార్యదర్శి బేరుగు రాకేశ్, కుల సభ్యులు మీనుగు సురేశ్, మాస్కుల రాజు, చింటూ పాల్గొన్నారు.

కమలాపూర్: మండలంలోని వంగపల్లిలో వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం వాల్మీకి బోయ సంఘం నాయకులు మాట్లాడుతూ.. రామాయణాన్ని రచించిన గొప్ప మహర్షి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి ఆచరించిన ఆదర్శాలను అందరు పాటించాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం గౌరవ అధ్యక్షుడు పెనుకుల సారయ్య, అధ్యక్షుడు పెనుకుల చందర్, ఉపాధ్యక్షుడు నరేందర్, నాయకులు సాంబయ్య, కొండల్, ఓదెలు, రాజేందర్, రమేష్, రవీందర్, కుల పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో పశువైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దీపిక

దామెర : మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి దీపిక పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మాట్లాడారు. రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయించాలని సూచించారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో రోగ నిరోధక శక్తి తగ్గడం వలన ఇబ్బంది పడతాయని తద్వారా పాల ఉత్పత్తి, పునరుత్పత్తి శక్తి తగ్గుతుందని తెలిపారు. కావున రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇప్పించాలని సూచించారు. ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నేటి నుంచి నవంబర్ 15వ తేదీ వరకు మండలంలో కొనసాగుతుందన్నారు. 19న ఒగ్లాపూర్‌లో, 21న కోకిలవాయి, 22న పసరగొండ, 23న పులుకుర్తి, 24న సీతారాంపూర్, 26న ముత్యాలపల్లి, 28న తక్కళ్లపాడు, 29న ల్యాదెళ్ల, నవంబర్ 4న దమ్మన్నపేట, 6న సింగరాజుపల్లి, వెంకటపూర్ గ్రామాల్లో శిబిరాలు ఉంటాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో దామెర వీఎల్ఓ లక్ష్మణ్, జేవీఓ సారంగం, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్, సిబ్బంది శంకర్, సతీశ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని ఉత్తర తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ వైద్యుల రజిత గురువారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం సాధించిన పదేండ్ల కేసీఆర్ పాలనలో కళాకారులకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని కోరారు. కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఫ్రీడమ్ ఫైటర్ తరహాలో నెలకు రూ.25వేల పెన్షన్ ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కష్టపడ్డ కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీలు, స్థానిక సంస్థల ఎన్నికలు, సంక్షేమ పథకాల్లో పదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికే ప్రాధాన్యతనివ్వాలని మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పది సంవత్సరాలు అధికారంలో లేకున్నా కష్టనష్టాలకు ఓర్చి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశామని, తీరా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనుచరులే తమపై పెత్తనం చేలాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని, ఇద్దరు ముగ్గురే తమకు నచ్చిన వారి పేర్లు రాసి ఎమ్మెల్యేకు పంపించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీలో అందరిని కలుపుకుని పోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు దేవేందర్ రెడ్డి, సంపత్, శంకర్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే దళితుల అభివృద్ధి



కేవీపీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న సంపత్

ఐనవోలు: దళితులు అభివృద్ధికి నోచుకోలేదని, ఐక్య ఉద్యమాలతోనే అభివృద్ధి సాధ్యమని కులవివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి మంద సంపత్ అన్నారు. కేవీపీఎస్ వార్షికోత్సవాలను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో మండల కార్యదర్శి గబ్బెట రాంకుమార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంపత్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మతోన్మాద విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను వివక్షతలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చూసీ చూడనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. దళితుల హక్కుల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కొరకు కేవీపీఎస్ పోరాటాలు నిర్వహించాలని, అందుకు దళితులు, మేధావులు పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు ఏలియా, కుమారస్వామి, సదానందం, కుమార్, ఏసెబు, చంద్రయ్య, రాజేశ్, రూబెన్, వేణు, నాగరాజు, శ్రీను, సంపత్, మల్లేశం, జోసెఫ్, రవి, రఘు, పండు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భార్యకాపురానికి రావడంలేదని యువకుడు ఆత్మహత్య



కొట్టె శ్రీకాంత్(ఫైల్)

ఐనవోలు: భార్యకాపురానికి రావడంలేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసి చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ ఏఎస్‌ఐ శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వనమాల కనపర్తి గ్రామానికి చెందిన కొట్టె శ్రీకాంత్(30) భార్య 10 నెలల క్రితం పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఈ నెల 14న సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి శ్రీకాంత్ ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. శ్రీకాంత్ తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ ఏఎస్‌ఐ శర్మ తెలిపారు.

వైభవంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహర పుత్ర అయ్యప్ప, ఓంకారేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో సంకటహర లక్ష్మీగణపతి విగ్రహాన్ని గురువారం పున ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అర్చకుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో దాసరి రాజేష్, సామల సదానందం, రామ వెంకటనారాయణ, బొట్ల సుధాకర్, కూచన రవీందర్, నరసింహ, అర్చకులు శ్రీకాంతాచారి, మధుచార్యులు తదితరులు పాల్గొన్నారు.